క్లుప్తంగా

భూ ఆక్రమణదారులపై కేసు

సిద్దవటం : పోలీస్ పటాలయం స్థలాన్ని అన్యాక్రాంతం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. మండలంలోని భాకరాపేట సమీపాన ఉన్న 11వ పోలీస్ పటాలయం స్థలం పెద్దపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 589లో ఖాళీగా ఉన్న కొంత భూమిని భాకరాపేట గ్రామానికి చెందిన మురళి, హరీష్ అనే తండ్రీ కొడుకులు అన్యాక్రాంతం చేసినట్లు నిర్ధారణ కావడంతో పోలీస్ బెటాలియన్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసత్య ప్రచారం తగదు


సర్పంచ్ శివనారాయణ

ఒంటిమిట్ట: సామాజిక మాధ్యమాల్లో తనపై టీడీపీ నాయకులు అసత్యాలను ప్రచారం చేయడం తగదని కొండమాచుపల్లి సర్పంచ్ మేరువ శివనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొండమాచుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 104 సిబ్బంది వైద్య సేవలు అందించేందుకు వచ్చారని, అయితే రెండవ శనివారం ప్రభుత్వ సెలవు కావడంతో పంచాయతీ కార్యాలయం మూసేశారని తెలిపారు. నెల రోజు కిందట కొండమాచుపల్లిలో వెలుగు యానిమేటర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ పొదుపు సంఘం మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఆఫీసు తాళం తీసుకు వెళ్లిందని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన తాళాలు తనకు ఇవ్వలేదన్నారు. శనివారం 104 సిబ్బంది వచ్చారని, తాళం పగుల గొట్టి 104 వైద్య సేవలను గ్రామస్తులకు అందేలా చేశామన్నారు. అయితే తాళాన్ని తాను ఉద్దేశపూర్వకంగా ఇవ్వలేదని కొందరు టీడీపీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

వరి పంట పరిశీలన


కడపాయపల్లెలో వర్షానికి నెలకొరిగిన వరి

సిద్దవటం : మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు 250 ఎకరాలలో వరి పంట నేల కొరిగి నష్టం జరిగిందని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, మాచుపల్లె, టక్కోలు, కడపాయపల్లె, లింగంపల్లి గ్రామాల్లో కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగి పంట దెబ్బతిన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు వచ్చిన పంట నాశనం కావడంతో తాము తీవ్రంగా నష్టపోయామని, అధికారులు తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

'అన్నదాత సుఖీభవ'పై అవగాహన



ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వీరబల్లి: వీరబల్లి మండలం, ప్రభుత్వ జూనియర్ కళాశాల వీరబల్లి పంచాయతీలోని పెద్ద హరిజనవాడలో శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అన్నదాత సుఖీభవ కార్యక్రమంపై ర్యాలీ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, పంట దిగుబడి, గిట్టుబాటు ధర, పంట మార్పిడి, సేంద్రియ ఎరువుల వాడకం, వాణిజ్య పంటలను ప్రోత్సహించడం వంటి విషయాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ భాస్కర్, జి. రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

చిట్వేలి: మండల పరిధిలోని వెంకట్రాజుపల్లిలో సీతారాముల లక్ష్మణ హనుమత్ సమేత ధ్వజ స్తంభ ప్రతిష్ట, నాగ దేవతల ప్రతిష్ట, అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శనివారం ప్రారంభయ్యాయి. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల మధ్య విగ్రహాల ప్రతిష్ట, 11 గంటల నుంచి సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.

ఆర్థికసాయం


చిన్నారికి ఆర్థిక సహాయం చేస్తున్న అబ్దుల్ సుబహాన్

ఒంటిమిట్ట: దానం చేసే గుణం ఉన్నవాడే దేవుడని నూరుల్లా ఇస్లాం ట్రస్ట్ అధినేత అబ్దుల్ సుబహాన్ అన్నారు. మండల పరిధిలోని మలకాటిపల్లి గ్రామ సమీపంలోని మదరసాలో శనివారం ఆయన ప్రభుత్వ పింఛన్ రాక ఇబ్బంది పడుతున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నూరుల్లా ఇస్లాం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి
- మొదలైన వైఎస్సార్‌సీపీ 'కోటి సంతకాల పోరు'
- పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమబాట


నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : పేదలకు మెరుగైన వైద్యాన్ని, వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, ప్రైవేటీకరణ ద్వారా వాటిని సీఎం చంద్రబాబు పేదలకు దూరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను నాయకులతో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అంతకుముందు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు తన బినామీలకు మంచి చేయడం కోసమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కూటమి పాలనపై ప్రజల్లో భ్రమలు తొలిగాయని, అన్ని రంగాల్లో విఫలమైందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. మెడిసిన్ విద్య కోసం పేద విద్యార్థులు లాంగ్ టర్మ్ కోచింగ్‌లు తీసుకుని లక్షల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారని, అటువంటి వారికి వైద్య విద్య ఉచితంగా అందించాలని వైఎస్ జగన్ సంకల్పించారని తెలిపారు.

అటకెక్కిన ఆరోగ్య శ్రీ

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. లక్షల మంది గుండె ఆపరేషన్లు చేయించుకుని ప్రాణాలతో ఉన్నారంటే అందుకు కారణం వైఎస్సార్‌రేనని తెలిపారు. అయితే చంద్రబాబు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేందుకు రూ.2700 కోట్ల బకాయిలు పెట్టారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్యం అందకుండా కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆరోగ్య శ్రీ సేవలు అందకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణు వర్ధన్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహ్మాన్, వైఎస్సాఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి జాఫర్ అలీఖాన్, మున్సిపల్ సెల్ కమిటీ కార్యదర్శి రియాజుర్ రెహ్మాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బేపారి మహమ్మద్ ఖాన్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్, ఎస్కే హుస్సేన్, మహిళా విభాగం నాయకులు జానం రాధ, కౌన్సిలర్లు అల్తాఫ్, ఈశ్వర్ ప్రసాద్, ఫయాజ్ బాషా, నాయకులు శ్యామ్ కుమార్, జానం రవీంద్ర యాదవ్, కొత్తమీర ప్రసాద్, అసద్ ఖాన్, బుజ్జిబాబు, షబ్బీర్, రిజ్వాన్, అమీర్, నవాజ్, ఇమ్రాన్, రవనఖ్, అమీర్, హబీబ్‌ఖాన్, క్రిష్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించాలి

కస్టమర్లకు నాణ్యమైన సేవలందించి మన్ననలను పొందాలని వైఎస్సాఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన ఆంధ్ర స్పైస్ వారి రాయలసీమ రుచులు హోటల్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణు వర్ధన్ రెడ్డి , వైఎస్సాఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి బేపారి మహమ్మద్ ఖాన్, నాయకులు షబ్బీర్, తిరుపాల్ నాయుడు, జబీవుల్లా, బేపారి అసద్ పాల్గొన్నారు.

గృహప్రవేశం

రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ఎదురుగా ఎంపీటీసీ రామచంద్రారెడ్డి నూతనంగా నిర్మించిన గృహప్రవేశానికి వైఎస్సాఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గాలివీడు : మండలంలెపి నూలివీడు గ్రామం బోడ సానివాండ్లపల్లెలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు జగన్నాథ రెడ్డి నూతన గృహ ప్రవేశ వేడుకలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, సర్పంచ్ ఉమాపతి రెడ్డి, ఎంపీటీసీ అమానుల్లా, నాయకులు ఎస్ఆర్ బాషా, రమణారెడ్డి, ఎల్లప్ప, రాజగోపాల్ రెడ్డి,రామాంజులు రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని హసనాపురం గ్రామం చింతలవాండ్లపల్లెకు చెందిన వారణాసి రెడ్డెప్ప రెడ్డి గారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

లక్కిరెడ్డిపల్లి: పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. లక్కిరెడ్డిపల్లి మండలం, దిన్నెపాడు గ్రామం, నరసింహరాజుగారిపల్లిలో శనివారం శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గజేంద్ర రెడ్డి, నరసరాజు, నాగరాజు, వెంకటరమణ రాజు, సుబ్బరాజు, విజయరామరాజు, లక్ష్మీరాజు, వెంకటేశ్వరరాజు, శ్రీరామరాజు, పవన్ రాజు, గుణశేఖర్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం

రాయచోటి జగదాంబసెంటర్ : రెడ్ క్రాస్ అందించే సేవలు ప్రశంసనీయమని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణం మాసాపేటలోని సాయిశుభ కల్యాణ మండపంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెడ్ క్రాస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. చైర్మన్‌గా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా మహమ్మద్ షరీఫ్, ట్రెజరర్‌గా డాక్టర్ వేణుగోపాల్, సభ్యులుగా డాక్టర్ జగదీశ్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ మహేశ్వరరాజు, డా.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ నర్సింహారెడ్డి, హరిశంకర్, బేబిలను ఎన్నుకున్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని చేయించారు.

రెడ్ క్రాస్ సేవలు విస్తృతం చేస్తాం

చిట్వేలి: జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను విస్తృతం చేస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అన్నమయ్య జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అన్నమయ్య జిల్లా వైస్ చైర్మన్‌గా చిట్వేలికి చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ నియమితులయ్యారు. శనివారం రాయచోటిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ చిట్వేలి వంటి మారుమూల ప్రాంతాల్లో సేవలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు.


రెడ్ క్రాస్ సొసైటీ నూతన కమిటీతో డీఆర్ఓ మధుసూదన్‌రావు

నాణ్యతతో పాటు పరిశుభ్రత పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : నాణ్యత ప్రమాణాలతో పాటు పరిశుభ్రత పాటించాలని అన్నమయ్య జిల్లా ఆహార భద్రత విభాగం అధికారులు రాయచోటి పట్టణంలోని పలు హోటళ్ల యజమానులకు సూచనలు, సలహాలిచ్చారు. శనివారం రాయచోటి అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి మున్సిపల్ అధికారులతో కలసి హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటళ్లలో వండుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని పరీక్షించారు. అలాగే రుచితో పాటు నాణ్యత ప్రమాణాలను పాటించడంతో పాటు హోటళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎక్కడైనా నాణ్యత ప్రమాణాలను, పరిశుభ్రతను పాటించకుండా నిబంధనలను అతిక్రమిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.

శ్రీశైలానికి బస్సు సౌకర్యం కల్పించండి


రమేష్‌నాయుడును సన్మానిస్తున్న లయన్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు

నందలూరు : రాజంపేట నుంచి పుణ్యక్షేత్రం శ్రీశైలానికి బస్సు సౌకర్యం కల్పించాలని నందలూరు లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడుకు శనివారం విన్నవించారు. ఈ సందర్భంగా లయన్ మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ గతంలో రాజంపేట నుంచి శ్రీశైలానికి ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేదని, ప్రస్తుతం బస్సు రద్దు చేశారని తెలిపారు. అయితే బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఈ విషయంపై చైర్మన్ స్పందించి అన్నమయ్య జిల్లా ఆర్టీసీ ఉన్నతాధికారి రాముతో ఫోన్ ద్వారా రాజంపేట నుంచి శ్రీశైలానికి బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో చర్చించి బస్సు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ కుర్రా మణియాదవ్, వాకర్ ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, సీనియర్ లయన్ అబ్దుల్లా, లయన్ దండే ప్రకాష్, హిమగిరి యాదవ్, గంధం గంగాధర్, గండికోట కృష్ణకుమార్, గుండు సురేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ ఆగడాలను ఎండగడదాం


పుల్లేటి చెరువుపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): రాష్ట్రంలో మితిమీరిన కూటమి ప్రభుత్వ ఆగడాలను ఎండగడదామని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్దిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతోందని, ఇందుకు క్షేత్రస్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో అవసరమన్నారు. అధిష్టానం పిలుపునిచ్చిన ప్రజా పోరాటాలలో పాల్గొని ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు. ప్రజలు తమకు దోచుకొని దాచుకోవడానికే అధికారమిచ్చారన్నట్లుగా కూటమి నేతలు అక్రమార్జనే ధ్యేయంగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అక్రమ మద్యం తయారై ఏరులై పారుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని, లిక్కర్ అక్రమ దందాకు పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. పేదలకు సైతం వైద్య విద్య, కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా తీసుకురావడమే లక్ష్యంగా గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చి, ఏడు కళాశాలలను పూర్తి చేశారని, అయినా ప్రస్తుత సీఎం చంద్రబాబు వాటిని ప్రైవేటుకు అప్పగించి పేదలకు వైద్య విద్య, ఉచిత వైద్యాన్ని దూరం చేస్తున్నారని విమర్శించారు. కూటమి నేతలు అనాలోచిత నిర్ణయాలను వెనక్కు తీసుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, రమేష్, రవీంద్రారెడ్డి, నరసింహారెడ్డి, విజయ్, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

చింతపర్తి గ్రామం పుల్లేటిచెరువుపల్లికి చెందిన రెడ్డెప్పరెడ్డి కుమారుడు కరుణాకర్‌రెడ్డి వివాహం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి.. నూతన వధూవరులు సుప్రియ, కరుణాకర్‌రెడ్డిలను ఆశీర్వదించి అభినందించారు.

ఏపీ సూపర్ కప్ పెన్నా జోన్ టీం ఎంపిక


సూపర్‌కప్ పెన్నా టీంకు ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు

మదనపల్లె సిటీ : ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీఆర్టీ మైదానంలో శనివారం సూపర్ కప్ పెన్నా టీం ఎంపిక చేశారు. ఎంపికకు అన్నమయ్య, వైఎస్సార్ కడప, సత్యసాయి జిల్లాల నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులు సుమారు 60 మంది హాజరయ్యారు. వీరికి మూడు మ్యాచ్‌లు నిర్వహించి 30 మందిని ఎంపిక చేశారు. వీరు వారం రోజుల పాటు శిక్షణ ఇస్తారు. నవంబర్ మొదటి వారంలో కృష్ణా జిల్లా మైలవరంలో జరిగే ఏపీ సూపర్ మొదటి దశ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని పెన్నా జోన్ కోఆర్డినేటర్ మురళీధర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు దిలీప్‌కుమార్, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, హెచ్ఎం రామా, జీఆర్టీ స్కూల్ కరస్పాండెంట్ జగన్‌మోహన్, సెలక్షన్ కమిటీ సభ్యులు జాన్ కమలేష్, సలీం, అబ్దుల్లా, మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

13న ధర్నాను విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 13న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కోట దానియల్ మాదిగ తెలిపారు. శనివారం పీలేరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలోనే ప్రధాన న్యాయమూర్తి కె.ఆర్.గవాయ్‌పై దాడి జరగడాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సుండుపల్లె : మండల పరిధిలోని రాచంవాండ్లపల్లి సమీపంలో మామిడి తోటలో జూదమాడుతున్నట్లు సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు సిబ్బందితో దాడి చేశారు. జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4300 నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం తిరుపతి అమర ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని మానవతా చైర్మన్ ప్రసాద్ వర్మ తెలిపారు. రోగులకు ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ జి. వెంకటేష్, డాక్టర్ పి. లోకేష్, డాక్టర్ తిరుమలేసు, డాక్టర్ సాంబశివ పాల్గొన్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్

మదనపల్లె రూరల్ : ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ కొలిజేట్ క్రీడల్లో... కరాటే కుమితే 84 కిలోల విభాగంలో పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి మజహర్ అలీ గోల్డ్ మెడల్ సాధించాడని ప్రిన్సిపాల్ సురభి రమాదేవి తెలిపారు. శనివారం కళాశాలలో గోల్డ్ మెడల్ సాధించిన మజహర్ అలీని అభినందించారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలు పాల్గొన్న కొలిజేట్ క్రీడా పోటీల్లో కళాశాల మొదటి సంవత్సరం బీబీఏ విద్యార్థి జి.మజహర్‌అలీ ఉత్తమ ప్రతిభ కనపరిచి గోల్డ్‌మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని మాసాపేటలోని సుగవాసి రాజారాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు వైవీఎస్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ ఎంకే రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థుల నైతిక విలువలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. మంచి ఆలోచనతో ప్రతి విద్యార్థి విద్యను అభ్యసిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాట వేయాలన్నారు. దాతలు సుగవాసి జానకిరామ్, కుప్పం రెడ్డి శంకర్‌ల సహాయ సహకారాలతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అసిస్టెంట్ గవర్నర్ శ్రీకృష్ణదేవరాయలు, సెక్రటరీ మహేష్‌రాజు, ట్రెజరర్ సూర్యప్రకాష్, అసిస్టెంట్ గవర్నర్ మురళీధర్‌రెడ్డి, రియాజుద్దీన్, ఖాదర్‌బాషా, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు పబ్లిసిటీ సురేష్, దేవునికి సురేష్, జోషి, మనోజ్, అష్రఫ్‌అలీ, రూపేష్, నరసింహ, స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేయాలి


మాట్లాడుతున్న పందుగోల మణి

ఓబులవారిపల్లె: అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం ఘటనపై సీబీఐ విచారణ చేయాలని అన్నమయ్య జిల్లా బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం, మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోందని తెలిపారు. కల్తీ మద్యం తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, అమ్మకాలను ఏమాత్రం ఉపేక్షించొద్దని పేర్కొన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులను వెంటనే తొలగించాలని కోరారు.కల్తీ మద్యంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోని పక్షంలో సీపీఐ తరుపున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఎం. జయరామయ్య, దార్ల రాజశేఖర్, బీకేఎంయూ నియోజకవర్గ అధ్యక్షురాలు మల్లిక, వెంకటరమణ, శ్రీనివాసులు, వెంకటేశు పాల్గొన్నారు.

చురుగ్గా 'ఎంత చిత్రం కథ' షూటింగ్


'ఎంత చిత్రం కథ' సినిమాలో ఓ సన్నివేశం చిత్రీకరణ

పీలేరు రూరల్ : పీలేరు పరిసర ప్రాంతాల్లో 'ఎంత చిత్రం కథ' సినిమా షూటింగ్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. వాయిపుత్ర క్రియేషన్స్ ముక్తా కిరణ్ సమర్పించు 'ఎంత చిత్రం కథ' చిత్ర సన్నివేశాలు ఊటుపల్లె సమీపంలోని మల్లేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో గత మూడు రోజులుగా చిత్రీకరిస్తున్నారు. ఎంఎస్ నాని అందించిన కథ ఆధారంగా నిర్మాతలు కిరణ్, సూర్య, జగదీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాకేష్ దర్శకత్వం వహిస్తున్నారు. మొదటి షెడ్యూల్ కడప పరిసరాల్లో చిత్రీకరించగా, రెండో షెడ్యూల్‌లోని కొన్ని సన్నివేశాలు పీలేరు పరిసర ప్రాంతల్లో చిత్రీకరిస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. కర్మసిద్ధాంతం ప్రధాన కథాంశంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో కథానాయకులుగా జగదీష్, సూర్య, కథానాయికిగా మౌని, ప్రతినాయకుడి హరీష్ నటిస్తున్నారు. అలాగే పీలేరుకు చెందిన ఆల్‌దిబెస్ ఖాదర్, రాధాకృష్ణ, విజయకుమార్, బాబ్జాన్ వివిధ పాత్రల్లో నటిస్తున్నారు. కెమెరామెన్‌గా సంజయ్‌జూమ్ ఇన్ నాని, స్టంట్ మాస్టర్లుగా సురేష్, సుహేల్ పని చేస్తున్నారు. సినిమా షూటింగ్‌ను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

విషసర్పం.. అప్రమత్తతే ముఖ్యం

- వర్షాకాలంలో పాముల బెడద
- అధైర్యపడితే ప్రాణాపాయమే
- సమయస్ఫూర్తే ప్రధానమంటున్న వైద్యులు



రాయచోటి జగదాంబసెంటర్: వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే సమయం ఇది. అన్నదాతలు రోజూ పొలానికి వెళుతుంటారు. వర్షాకాలంలో పాములు నివాసం ఉండే ప్రదేశాలు ముంపునకు గురవడంతో అవి సురక్షితమైన ప్రదేశాలకు మకాం మారుస్తుంటాయి. అయితే ఏ పాము కరిచినా తక్షణం వైద్యసేవలు పొందడం అనివార్యమని గుర్తించుకోవాలి. పాము కరిచిన వెంటనే చికిత్స తీసుకొని మరణించిన వారు చాలా అరుదు. పాము కాటుకు మొదట బాధ్యత వహించాల్సింది మనమే. వాటికి మనం ఏదైనా అపాయం తలపెడతామోనన్న భయంతోనే అవి కాటేస్తుంటాయి. వాటికి పొరపాటున కాలితో తొక్కేయడమో లేక గడ్డి కోస్తున్నపుడు వాటిని పట్టుకోవడమో, తాకడమో చేయడంతోనే అవి కాటేస్తున్నాయని గుర్తించాలి. వాతావరణం అనుకూలించడంతో విషసర్పాలు పొదల మాటు నుంచి ఆరు బయటకు వస్తాయి. ఎలుకలు, పందికొక్కులు వంటి వాటిని తినేందుకు పాములు పంట పొలాల వద్ద కాపు కాస్తాయని, పొలాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

సర్పాల్లో ఎన్నో రకాలు

నిత్యం మనకు కనిపించే విషసర్పాలు మాత్రం నాలుగే ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. మనకు నిత్యం కనిపించే వాటిల్లో తాచుపాము (నాగుపాము), కట్లపాము, రక్తపింజిరి, గుమ్మడిత్తుల పింజరి రకం సర్పాలే విషపూరితమైనవి. ఏటా వర్షాకాలంలో పొలం గట్లపైన, పెరట్లో గడ్డివాముల పైన సూర్యకాంతి కోసం పడగ ఎత్తుకొని నిరీక్షిస్తుంటాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కాటు తప్పదు.

గుర్తించడం ఎలా..

పాము కాటు వేసిన అనంతరం ఇది విషపూరితమైనదా కదా అన్నది తెలుసుకోవాలి. కాటు వేసిన ప్రాంతంలో ఎన్ని గాట్లు ఉన్నాయో పరిశీలించాలి. ఒకటి, రెండు పళ్లతో గాట్లు ఉంటే విషపూరితమైనది. మూడు అంతకంటే ఎక్కువ ఉంటే విషం లేని పాములుగా ప్రాథమిక నిర్ధారణకు రావొచ్చు. పాము కాటు వేసిన ప్రాంతం నుంచి విషం క్రమంగా శరీరంలోని అన్ని భాగాలకు చేరుతుంది. ఇందుకు మూడు గంటల సమయం పడుతుంది. ఆలోపు చికిత్స చేయకపోతే మనిషి మృత్యువాత పడతాడు. ఇక పాము విషం నాలుగు రకాలుగా పనిచేస్తుంది. గుండె, నరాలు, రక్తం, శరీర కణజాల వ్యవస్థలపై పనిచేస్తుంది. కాటుకు గురైన వ్యక్తి విష ప్రభావానికి లోనైపుడు కళ్ల మూతలు పడడం, మెడ పక్కకు వంగడం, గాలి పీల్చకపోవడం, గుండె దడ, ఎక్కువగా చెమటలు పట్టడం , బీపీ వంటి లక్షణాలుంటాయి.

యాంటీబయాటిక్ అందుబాటులో ఉంది



వర్షాకాలం విషపురుగులతో జాగ్రత్తగా ఉండాలి. పాము కరిచిన వెంటనే కంగారు పడకుండా కరిచిన పాము ఎలాంటిదో తెలుసుకునే ప్రయత్నం చేసి దానికి సరైన చికిత్సని అందించే ప్రయత్నం చేయాలి. సీహెచ్‌సీలో యాంటీ స్నేక్ వీనమ్ (పాము కాటుకు సూది మందు) అందుబాటులో ఉంది. ఏ సమయంలోనైనా చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ డేవిడ్ సుకుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి